ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

సోషలిజంతోనే ప్రత్యామ్నాయం

- న్యూయార్క్ మేయర్ గెలుపు సామ్రాజ్యవాదులకు చెంపపెట్టు
- ప్రయివేటు జపం చేస్తూ చంద్రబాబు పాలన
- ప్రజా పోరాటాల మద్దతుతో సోషలిజం సాధ్యం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- కదిరిలో 'అక్టోబర్ విప్లవం విశిష్టత'పై సదస్సు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కార్మికులు, కర్షకులు, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సోషలిజం పాలనతోనే సాధ్యమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలియజేశారు. 'అక్టోబర్ విప్లవం-విశిష్టత' అన్న అంశంపై శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నాడు సదస్సు నిర్వహించారు. సదస్సుకు శ్రీనివాసరావుతో పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, సీనియర్ నాయకులు జి.ఓబులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా కదిరి పట్టణం ఆర్అండ్‌బి అతిథి గృహం నుంచి కోనేరు వద్ద ఉన్న ఎస్‌కె ఫంక్షన్ హాల్ వరకు సిపిఎం శ్రేణులు ఎర్రజెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ఎస్‌కె ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సదస్సులో శ్రీనివాసరావు మాట్లాడారు. అసలైన అభివృద్ధికి కార్మికులు, కర్షకులు, రైతులు మూలం అన్నారు. అలాంటి కార్మికుల మనుగడకు సోషలిజమే అసలైన ప్రత్యామ్నాయం అన్నారు. రష్యాలో దున్నేవానికే భూమి, పరిశ్రమలపై కార్మికులకు హక్కు, విద్య, వైద్యం, ఉద్యోగాల కల్పన, ఆహారభద్రతను అక్కడి సోషలిస్టు ప్రభుత్వం బాధ్యతగా అందించిందన్నారు. కమ్యూనిస్టులకు పాలన చేయడం రాదని ఎద్దేవా చేసిన పెట్టుబడిదారులు ముక్కున వేలేసుకునేలా అందరికీ ఉపాధి కల్పిస్తూ పాలన సాగించిందన్నారు. వామపక్ష పార్టీలు అధికారంలో ఉన్న కేరళ దేశంలో పేదరికం లేని రాష్ట్రంగా ఆదర్శంగా నిలిచిందన్నారు. సున్నా శాతం పేదరిక నిర్మూలన కమ్యూనిస్టు పార్టీల ప్రభుత్వంలో సాధ్యమైందని తెలియజేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారి వ్యవస్థకు సహకరిస్తూ పాలన సాగిస్తోందన్నారు. రైతులు, కార్మికులను అణిచివేతకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివద్ధి పేరుతో పంటలు పండే భూములను కార్పొరేట్‌కు 90 పైసలతో ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయివేటు జపం చేస్తూ పాలనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు సరిగా పనిచేయవు, ప్రయివేటు సంస్థల్లో మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆయన చెప్పడం సిగ్గుచేటన్నారు. గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఇప్పుడు చంద్రబాబు ఇద్దరూ అంబానీ, అదానీ కోసం పనిచేసే పాలన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పి4 అంటూ గొప్పలు చెప్పే రాష్ట్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికుల సంక్షేమాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో అంగన్వాడీలు, ఆరోగ్య కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులకు 15 సంవత్సరాలుగా వేతనాలు ఇవ్వడం లేదంటే ఈ ప్రభుత్వాలు ఎవరి కోసం పని చేస్తున్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను నిర్వీర్యం చేసేలా చంద్రబాబు విధానాలు ఉన్నాయన్నారు. అమెరికాలో 20 లక్షల మంది తెలుగు వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తుంటే చంద్రబాబు దీనిపై ఎందుకు నోరుమెదపడం లేదని నిలదీశారు. స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తూ మిట్టల్‌కు భూములు కేటాయిస్తుండడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు.

బీహార్లో ఎన్నికలకు ఒక్కరోజు ముందు మహిళలకు రూ.10వేలు ఇచ్చారని, ఆ డబ్బుతోనే అక్కడి ఎన్నికల్లో ఎన్డీఏ గెలిచింది తప్పా ప్రజల మద్దతుతో కాదన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు హిందూ, ముస్లిం మతాలు మధ్య బిజెపి చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. ప్రజలు ఇలాంటి మతోన్మాద పాలనను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా పోరాటాల ద్వారా ఎర్ర జెండా నీడలో పేదలు, మధ్యతరగతి ప్రజల అభివృద్ధి సాధ్యం అవుతుందని తెలిపారు.

అమెరికా వంటి దేశాల్లో సోజలిజం లేదు.. కమ్యూనిస్టు పార్టీ లేదు అంటూ బీరాలు పలికన సామ్రాజ్య వాదులకు న్యూయార్క్ నగరంలో మేయర్‌గా సోషలిజం బావాలు కలిగిన అభ్యర్థి గెలవడం చెప్పుపెట్టు అన్నారు. తాను సోషలిస్టు మద్దతుదారున్ని అన్ని చెప్పి ఎన్నికల ప్రచారం చేసిన మమ్దనీకి న్యూయార్క్ ప్రజలు మద్దతుగా నిలిచి అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. సోషలిజంకు కాలం చెల్లిందని చెప్పుకునే పాలకులకు న్యూయార్క్ మేయర్ గెలుపు గుణపాఠంగా నిలుస్తుందన్నారు.

సోషలిజమే పరిష్కారం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

పేద, మధ్యతరగతి ప్రజలు, కార్మికులు, రైతుల అభివృద్ధి సోషలిజం ద్వారానే సాధ్యమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ తెలియజేశారు. అక్టోబర్ విప్లవం ప్రపంచ గమనాన్ని మార్చివేసిందన్నారు. దేశంలో ఆకలి, పేదరికం, నిరుద్యోగం లేని సమాజాన్ని సాధించడం కోసం, సోషలిజం స్థాపనకు ప్రతి ఒక్కరూ అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు మాట్లాడుతూ దేశంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించలేదన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. బిజెపి ప్రభుత్వం ఆదానీ, అంబానీలకు అనుకూలంగా చట్టాలు చేసి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. ఇలాంటి వాటిపై ప్రజలందూ ఐక్యమత్యంతో పోరాడి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామక్రిష్ణ, కమిటీ సభ్యులు దిల్షాద్, జడ్పీ.శ్రీనివాసులు, జిఎల్.నరసింహులు, ఎన్.లక్ష్మీనారాయణ, జంగాలపల్లి పెద్దన్న, ఎ.హరి, జగన్, ఫిరంగి ప్రవీణ్ కుమార్, సాంబశివ, రామ్మోహన్, బాబ్జాన్, సుధాకర్ రెడ్డి, ముస్తాక్, అంజి, ముత్యాలు, ఇ.బాబా, పైపల్లి గంగాధర, ముదిగుబ్బ పెద్దన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున పాల్గొన్నారు.

అరటి రైతుల ఆశలు ఆవిరి..!

- ఉద్యానవన రైతుకు ఊతమేదీ.?
- కొనేవారు లేక చెట్లపైనే మాగుతున్న కాయలు
- పెట్టుబడులు కూడా చేతికందని దుస్థితి
- రైతులు విలవిల
- కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన

ఆందోళన చేస్తున్న పండ్లతోటల, రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తోంది. గత ఏడాదిలో హార్టికల్చర్ ఎన్‌క్లేవ్ సైతం నిర్వహించి ప్రాధాన్యతనిస్తున్నట్టు ప్రచారం చేశారు. అంతేకాకుండా ఐదేళ్ల ప్రగతిలోనూ ఉద్యానవన పంటలదే ప్రధానమైన లక్ష్యంగా పెట్టుకుని దిగుబడులు రెండింతలు చేస్తామని ప్రకటించారు. ఆచరణలో చూస్తే పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఉద్యానవన రైతులు దిక్కులు చూసే పరిస్థితి నెలకొంది. మొన్నటి వరకు చీనీ రైతుల ఈ రకంగా ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికీ చీనికి సరైన ధర మార్కెట్‌లో లేదు. ఇప్పుడు తాజాగా అరటి పంటనుకొనే నాథుడు లేక చెట్లపైనే కాయలు మాగిపోతున్నాయి. ఒకవేళ ఎక్కడైనా కొన్నా టన్ను రెండు వేలు కూడా ధర ఉండటం లేదు. దీంతో పంటను అర్థంతరంగా రైతులు తొలగించేందుకు సిద్ధమవుతున్నారు.

టన్ను రెండు వేలు కూడా ధర లేక

జిల్లాలో సుమారు 37 వేల ఎకరాల్లో అరట పంట సాగైంది. ఏడాదికి సగటున 22 లక్షల టన్నుల వరకు దిగుబడి వస్తుంది. రాష్ట్రంలోనే అత్యధిక దిగుబడి అరటికి జిల్లాలోనే వస్తుంది. ఈ పెద్దఎత్తున పంట దిగుబడి వచ్చే ఈ జిల్లాలో కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. మొదటి కోత అయితే కొంత ధర ఉన్నప్పటికీ రెండవ కోతను కోనేవారు లేరు. చెట్లపైనే కాయలు మాగిపోతున్నాయి. ఈ పంటను పండించడానికి ఎకరానికి సుమారు రెండు లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతోంది. ఇంత పెట్టుబడులు పెట్టి పంట బాగా వచ్చినప్పటికీ ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంటోంది. మహారాష్ట్రలోనూ ఎక్కువ పంట ఉండటంతో ఇక్కడ కొనేందుకు వ్యాపారులు రావడం లేదని అంటుండటంతో రైతులకు ఏమి చేయాలో పాలుపోకుండా ఉంది.

మూడు ఎకరాల్లో సాగు చేస్తే కొనేవారు లేరు

మూడు ఎకరాల్లో సుమారు ఆరు లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టాను. తుఫాన్లు ఇవన్నీ వచ్చిన పంటను రక్షించుకుని దిగుబడులు బాగా వచ్చాయి. పంట బాగొచ్చిందనుకుంటే కొనేవారు లేక ధర లేదు. టన్ను రెండు వేల రూపాయలకు కూడా అడిగే నాథుడు లేడు. దీంతో చెట్లపైనే కాయలు మాగిపోతున్నాయి. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి.

చిన్న ఆంజినేయులు, రెడ్డిపల్లి గ్రామం, బుక్కరాయసముద్రం మండలం.

ఉద్యానవన పంటలకు ఊతమివ్వాలి

అనంతపురం జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని ప్రభుత్వం ఒకవైపు ప్రకటనలు చేస్తోంది. ఆచరణలో అదేదీ అమలు జరగడం లేదు. రైతులు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి సాగు చేస్తే పండిన పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదు. కనీసం పంటను కొనేవారు కూడా ముందుకు రావడం లేదు. కావున తక్షణం ప్రభుత్వం జోక్యం చేసుకుని టన్ను రూ.10 వేల చొప్పున అరటి పంటను కొనుగోలు చేయాలి. అదే విధంగా ఇతర ఉద్యనవన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి.

శివారెడ్డి, ఎపి పండ్లతోటల రైతు సంఘం జిల్లా నాయకులు.

టన్ను రూ.15 వేలతో ప్రభుత్వం కొనుగోలు చేయాలి

పండ్లతోటలు, ఎపి రైతుసంఘం డిమాండ్ - అనంత కలెక్టరేట్ వద్ద ఆందోళన

అనంతపురం కలెక్టరేట్ : ప్రభుత్వమే అరటి పంటను టన్ను రూ.15 వేలతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని పండ్లతోటల, ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. అరటికి మద్దతు ధర కల్పించాలని కోరుతూ రైతులతో కలిసి సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. అరటి గెలలను కలెక్టరేట్ ముందు ఉంచి మద్దతు ధర ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అరటి సుమారు 15 వేల హెక్టార్లలో సాగు అయ్యిందన్నారు. ఎకరాకు లక్ష రూపాయలకు పైగానే రైతులు పెట్టుబడులు పెట్టారన్నారు. పంట చేతికొచ్చే సమయంలో ధరలు పడిపోవడంతో రైతులకు పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి నెలకొందన్నారు. అరటిని కొనుగోలు చేసేందుకు వ్యాపారులెవరూ తోటల వద్దకు రావడం లేదన్నారు. వచ్చిన వ్యాపారులు కూడా సిండికేట్ అయ్యి టన్ను రూ.2 నుంచి రూ.3వేలకు మించి కొనడం లేదన్నారు. కూలి కూడా గిట్టుకోకపోవడంతో చేసేది లేక రైతులు పంటను కాయలతో పాటు తొలగించే పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం జిల్లాలో సాగుచేసిన 75 శాతం పంట కోత దశలో ఉందని, రాష్ట్ర ప్రభుత్వం వీటి కొనుగోలుకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేసి టన్ను రూ.15,000తో తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యాన శాఖ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో అరటి తోటలు పరిశీలించి జరిగిన నష్టం ప్రభుత్వానికి నివేదిక అందించాలన్నారు. నష్టపోయిన ప్రతి అరటి రైతుకూ టన్ను రూ.15 వేలకు తక్కువ కాకుండా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ ఉద్యాన శాఖ అధికారులు, కంపెనీలతో మాట్లాడి అరటి రైతులకు మేలు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అరటి రైతులు హనుమంతు, చిన్న ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు రెడ్డిపల్లి శ్రీనివాసులు, సంజీవరెడ్డి, వెంకట కొండ, బి.చంద్రశేఖర్ రెడ్డి, జయచంద్రా రెడ్డి, గంగిరెడ్డి, హరినాథ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

విలేకరిపై దాడి హేయం

చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వాస్తవాలను ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేసిన చిలమత్తూరు ప్రజాశక్తి విలేకరిపై ఇటీవల అధికార పార్టీ రాజకీయ నాయకుడు దాడి చేయడం అత్యంత హేయమైన ఘటన అని, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పాత్రికేయులు కోరారు. ఈ మేరకు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీని ప్రజాశక్తి జిల్లా ఎడిషన్ మేనేజర్ వేణుగోపాల్, శ్రీనివాసులు, నాగార్జున ఆధ్వర్యంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిలమత్తూరు మండల పరిధిలోని తుమ్మలకుంట గ్రామం నుంచి శిర రహదారి వరకు రూ.45 లక్షల జిఎస్ నిధులతో వేస్తున్న రోడ్డు నాణ్యతగా లేదని ప్రజాశక్తి పేపర్లో విలేకరి వార్త రాశాడన్నారు. దీనిపై కాంట్రాక్టర్, టిడిపి నాయకులు నాగరాజు యాదవ్, అతని కుమారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ విలేకరిపై దాడి చేశారన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయకుండా ప్రజాశక్తి విలేకరిపై అక్రమ కేసు బనాయించడం దుర్మార్గమన్నారు. దీనిపై విచారణ జరిపించాలని ఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి విలేకరులు మహేష్, శ్రీరాములు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుర్తుండిపోయేలా బాబా శతజయంతి ఉత్సవాలు

- హాజరుకానున్న రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రులు
- పర్యాటకుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి
- సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె. రత్నాకర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీసత్యసాయిశతజయంతి వేడుకలు గుర్తుండిపోయేలా నిర్వహిస్తున్నామని శ్రీసత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె. రత్నాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీసత్యసాయి శతజయంతి వేడుకల నిర్వహణపై మాట్లాడారు. శతజయంతి ఏర్పాట్లు దాదాపు సంవత్సరం క్రితమే ప్రారంభమయ్యాయన్నారు. శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్, సేవా సంస్థలు, పూర్వ విద్యార్థులు, వేలాది మంది వాలంటీర్ల సమన్వయంతో పెద్ద స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. రైల్వే స్టేషన్ నుంచి ఆశ్రమం వరకు మొత్తం పట్టణం భక్తులను ఆహ్వానించేందుకు అందంగా అలంకరించినట్లు వివరించారు. ఈ సంవత్సరం కాలంలో దేశ, విదేశీ భక్తులు కలిసి 220కిపైగా సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను శతజయంతి సందర్భంగా సమర్పించారన్నారు. ఇంతకాలం శ్రీ వేణుగోపాల స్వామి రథోత్సవంగా పిలువబడిన ఈ కార్యక్రమం ఇప్పుడు శ్రీ సత్య సాయి రథోత్సవంగా పునరుద్ధరించబడినట్లు చెప్పారు. ఈ రథోత్సవం ఈనెల 18 నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ శతజయంతి వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొననున్నారన్నారు. 19న ప్రధానమంత్రి, 22న రాష్ట్రపతి హాజరుకానున్నారన్నారు. 22న జరిగే కాన్వొకేషన్‌కు ప్రధాన అతిథిగా హాజరుకానున్న ఉపరాష్ట్రపతి 23న నిర్వహించే సత్యసాయి జన్మదిన వేడుకల్లో పాల్గొంటారన్నారు. అంతేకాకుండా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా హాజరుకానున్నట్లు రత్నాకర్ వివరించారు. శతజయంతిని పురస్కరించుకొని స్మారక నాణెం, తపాలా స్టాంప్ విడుదల చేయబడనుందన్నారు. శతజయంతి ఉత్సవాలకు భక్తుల రాక సులభతరం చేయడానికి, భారత ప్రభుత్వం, సదరన్ రైల్వేస్ కలిసి 45 ప్రత్యేక రైళ్లను పుట్టపర్తికి నడుపుతున్నారన్నారు. ఈ సంవత్సరం వేడుకలలో గ్లోబల్ భాగస్వామ్యం విస్తరించిందని చెప్పారు. అనంతరం శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆల్‌ఇండియా అధ్యక్షులు నిమిష్ పండ్యా మాట్లాడారు. సంస్థతో ఏ సంబంధమూ లేని అనేక మంది పుట్టపర్తికి వస్తూ ప్రేమతో సేవలో పాల్గొంటున్నారని తెలిపారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సత్యసాయి ట్రస్టీ ఆర్‌జె. రత్నాకర్

నృత్య పోటీల్లో విద్యార్థిని రాణింపు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రాకింగ్ స్టార్స్ డాన్స్ ధర్మవరం వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో ఇంటర్నేషనల్ డ్యాన్స్ 2025 పోటీల్లో ధర్మవరం పట్టణంలోని సాయినగర్ సూర్య ఉన్నత పాఠశాల విద్యార్థిని టిఎం. యామిని ప్రతిభ కనపరినట్లు పాఠశాల కరస్పాండెంట్ నరేంద్రబాబు, డాన్స్ మాస్టర్ లోకేష్ తెలిపారు. ఈసందర్భంగా సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా డాన్స్ మాస్టర్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు టిఎం యామినికి అభినందనలు తెలిపారు.

విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అధునాతన సౌకర్యాలతో పట్టుగూళ్ల మార్కెట్ నిర్మాణం

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ఉన్న పట్టుగూళ్ల మార్కెట్ ను అధునాతన సౌకర్యాలతో నిర్మాణం చేస్తామని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. సోమవారం పట్టు పరిశ్రమ శాఖ అధికారులతో పట్టుగుళ్ల మార్కెట్ సమస్యలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను అధికారులు బాలకృష్ణ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు, రీలర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ అధునాతన సౌకర్యాలతో నిర్మాణం చేస్తున్నామన్నారు. నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే నిధులు సైతం మంజూరు చేశామని త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. పెండింగ్ లో ఉన్న ఇన్సెంటివ్‌ల విడుదలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారులందరూ పట్టు పరిశ్రమ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేయాలని సూచించారు. అంతకు ముందు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థ నారాయణరెడ్డి, కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు చింతపండు సీజన్ సమయంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసే విధంగా చూడాలని కోరారు. మార్కెట్ యార్డులో రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. టిడిపి నాయకులతో నిర్వహించిన సమీక్షలో జామియా మసీదు ముత్వవల్లి అస్లాం, మైనార్టీ నాయకులు డైమండ్ బాబా అన్వర్, ఆర్ ఎం ఎస్ షఫీ వుల్లా తదితరులు మాట్లాడుతూ, హిందూపురం లో ముస్లిం మైనార్టీల విద్యార్థుల కోసం ఉర్దూ జూనియర్ కళాశాల, కోచింగ్ సెంటర్ తో పాటు జామియా మసీదు నిర్మాణంలో భాగంగా పెండింగ్ లో ఉన్న బిల్లులను మంజూరు అయ్యేవిధంగా చూడాలని కోరారు. సాయిరాం ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా క్లస్టర్ ఇన్‌ఛార్జులు, బూత్ కమిటీ కన్వీనర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్, బూత్ ల వారీగా వార్డులు, గ్రామాల వారీగా పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యలు ఇతర అంశాలపై ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యను వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని పార్టీ అభివృద్ధి కోసం కషి చేశామని, అయితే ప్రస్తుతం టిడిపి అధికారంలో ఉన్నప్పటికీ తమకు ఆదరణ కరువైందనివాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో ముందుకెళ్లి గ్రామ స్థాయి నుంచి, పట్టణంలో వార్డు స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పని చేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వెంకటేష్, మీడియా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ యాదవ్, లేపాక్షి కన్వీనర్ జయప్ప, చిలమత్తూరు రంగారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థ నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు అమర్నాథ్, శేఖర్, కౌన్సిలర్ రాఘవేంద్ర కుమార్, బేకరీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి జర్నలిస్టుకు ఇంటి పట్టా : అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి పట్టా అందిస్తామని ఎమ్మెల్యే బాలకృష్ణ భరోసా ఇచ్చారు. జర్నలిస్టులకు ఇంటి పట్టాలను మంజూరు చేయాలని సోమవారం జర్నలిస్టులు వినతిని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ కాలనీ, హౌస్ బిల్డింగ్ సొసైటీ కమిటీతో పాటు జర్నలిస్టులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ : 38 మంది లబ్ధిదారులకు రూ. 45 లక్షల విలువైన చెక్కులను బాలకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి వందల కోట్ల రూపాయలు అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

తపాలా బీమాతో ప్రయోజనం : తపాలా శాఖలో బీమా సౌకర్యం పొందడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. తపాలా శాఖలో జీవిత బీమా సౌకర్యం పొంది ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి, గాయపడిన బాధితులకు మంజూరైన రూ.15 లక్షల ఆర్థిక సహాయాన్ని తన క్యాంపు కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ అధికారులు పోస్ట్ మాస్టర్ మార్కండేయ, తపాలా శాఖ అధికారులు మల్లికార్జున, మురళీ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా జగనన్న లేఅవుట్..!

ప్రజాశక్తి-సోమందేపల్లి

వైసిపి హయాంలో సోమందేపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో సోమందేపల్లికి సుమారు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాపిరెడ్డిపల్లి కొండ ప్రాంతంలో జగనన్న లేఔట్ ఏర్పాటు చేశారు. అందులో మండలంలోని పలు గ్రామాలకు చెందిన నిరుపేదలకు సుమారు 70 ప్లాట్లు కేటాయించి హౌసింగ్ కింద 35 ఇళ్లను మంజూరు చేశారు. అయితే కేవలం ముగ్గురు లబ్ధిదారులు మాత్రమే ఇళ్ల నిర్మాణం పూర్తి చేయగా సుమారు 27 మంది బేస్‌మెంట్ వేసి వదిలేశారు. ముగ్గురు రూఫ్ లెవెల్ వరకూ నిర్మాణం చేపట్టగా ముగ్గురు నిర్మాణ పనులే ప్రారంభించలేదు. కాలనీ ఏర్పడి మూడేళ్లు పూర్తయినా లబ్ధిదారులు అక్కడ నివసించడానికి ఆసక్తి చూపడం లేదు. కారణం కొండ ప్రాంతంలో లేఅవుట్ ఏర్పాటు చేయడం, కనీస సౌకర్యాలు కల్పించకపోవడమే. కాలనీకి వెళ్లేందుకు కనీసం రహదారి సౌకర్యం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

కనీస సౌకర్యాలు లేని జగనన్న కాలనీ

లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు : హౌసింగ్ ఏఈ రామాంజనేయులు

ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు అవగాహన కల్పించాం. ప్రస్తుతం ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు ఎస్సీ, బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు అదనంగా మంజూరు చేస్తుంది. అయినా లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు.

నివాసయోగ్యమైన ప్రాంతం కాదు : వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు పెద్దన్న

పాపిరెడ్డిపల్లి కొండ ప్రాంతంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్ నివాస యోగ్యమైన ప్రాంతం కాదు. అక్కడ లేఅవుట్ ఏర్పాటు చేయరాదని గత ప్రభుత్వ కాలంలోనే అధికారులకు సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినతులు ఇచ్చాం. అయినా అధికారులు, నాయకులు అత్యుత్సాహంతో పేదలకు స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. కొందరు లబ్ధిదారులు అప్పు చేసి నిర్మాణాలు చేపట్టారు. అయితే అధికారులు అక్కడ కనీస వసతులు కల్పించడంలేదు. ఇకనైనా అధికారులు స్పందించి ఆ కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పించాలి. లేనిచో మరో నివాసయోగ్యమైన ప్రాంతంలో స్థలాలు మంజూరు చేసి, ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

తనకల్లులో యథేచ్ఛగా అక్రమ మైనింగ్

నిబంధనలు గాలికి.. తరలిపోతున్న ఖనిజ సంపద

ప్రజాశక్తి-తనకల్లు

తనకల్లు మండల పరిధిలోని పలు గ్రామాల్లో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా కొనసాగుతోందన్న ఆరోపణలు వినపడుతున్నాయి. పక్క రాష్ట్రాల నుండి వచ్చిన వ్యాపారులు మైనింగ్ కోసం ప్రభుత్వం నుండి అనుమతులు పొంది వారి పరిధిని దాటి మైనింగ్ చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్న సమాచారం. మండల పరిధిలోని టి.చదుం పంచాయతీ అగ్రహారం పల్లి వద్ద సర్వే నంబర్ 21లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మైనింగ్ చేసి ఖనిజ సంపదను తరలిస్తున్నట్లు విమర్శలున్నాయి. చట్టబద్ధమైన మైనింగ్ కార్యకలాపాలను, సరైన విధానాలను, అనుసరించకుండా విలువైన ఖనిజాలు, వెలితి తీయడం రాత్రి వేళల్లో అక్రమ రవాణా చేయడం నిత్యకృత్యంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. మైనింగ్ చేయడానికి లీజుకు తీసుకున్న భూమిలో కాకుండా చుట్టుపక్కల భూముల్లో కూడా మైనింగ్ చేస్తూ ఖనిజాలను వెలికితీస్తూ అక్రమ పద్ధతుల్లో రవాణా చేస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మైనింగ్ కార్యకలాపాలలో కార్మికులకు సంబంధించిన భద్రత నిబంధనలను పాటించకుండా పర్యావరణాన్ని దెబ్బతీస్తూ అక్రమ మైనింగ్ కొనసాగిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తే కొంతమంది రాజకీయ నాయకుల పేర్లు చెప్పి వారిని బెదిరిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. విచ్చలవిడిగా మైనింగ్ చేస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నా సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించడం లేదని, సాధారణ పౌరులు ప్రశ్నిస్తే మైనింగ్ వ్యాపారులు వారిని బెదిరించే ధోరణిలో మాట్లాడున్నారని తెలుస్తోంది. ఇంతజరుగుతున్నా అధికారులు మామూళ్ల మత్తులో మునిగి పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మైనింగ్ జరుగుతున్న ప్రాంతం

ఘనంగా ప్రాథమిక సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

రైతులకు మెరుగైన సేవలందించి సహకార సొసైటీని ప్రథమ స్థానంలో నిలుపుదామని సీఈఓ బావ పక్రుద్దీన్ తెలిపారు. సొసైటీ వారోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయడం బంగారుపై రుణాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు సేకరించడంలో అన్ని బ్యాంకుల కంటే సహకార సొసైటీ ముందంజలో ఉందని అన్నారు. ఈ సేవలను ఇలాగే కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్‌తో పాటు సిబ్బంది ప్రభావతమ్మ, సుమశ్రీ, డైరెక్టర్లు లక్ష్మీ నాయక్, మల్లారెడ్డి, రైతులు అంకమత్య, నరసింహులు, పాలగిరి భాష, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : 72వ అఖిల భారత వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సోమవారం సహకార సంఘం అధ్యక్షుడు పాల్యం రామానుజన్ రెడ్డి సబ్ డివిజనల్ అధికారి జనార్ధన షాహిద్‌బాషా పాల్గొని జెండా వందనం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సంఘంలో ప్రభుత్వం రైతులకు రాయితీలతో ఎరువులు అందిస్తామన్నారు. అలాగే సహకార సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సీఈవో షాకీర్, షామీర్‌బాషా, డైరెక్టర్లు రమణ, మునాఫ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, నరసింహ, రియాజ్, రవీంద్రారెడ్డి, సర్పంచి శివప్పనాయుడు, రైతులు మనోహర్ రెడ్డి, రామచంద్ర ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : సహకార సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఛైర్మన్ రవిమోహన్ తెలిపారు. మండలంలోని గోనివారిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సహకార సంఘం ఛైర్మన్ రవిమోహన్ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా ప్రభు త్వం కల్పించే ప్రయోజనాలు, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, మందులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రామచంద్రప్ప, రంగప్ప, మలసముద్రం సర్పంచి సువర్ణ, అశ్వర్థరెడ్డి, ఎస్‌డిఎల్‌సిఒ నారాయణమూర్తి, సూపర్వైజర్స్ యశోదమ్మ, గోవిందరెడ్డి, సీఈవో లు సాయిరామ్, శంకర్, స్థలదాత మోహన్‌రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గోరంట్ల సహకార సంఘం వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఛైర్మన్ రవిమోహన్

గుడిబండ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులను అన్ని విధాలా ఆదుకుం టున్నట్లు సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప తెలిపారు. స్థానిక సహకార సంఘం కార్యాల యంలో సోమవారం మద్దనకుంటప్ప ఆధ్వర్యంలో 72వ జాతీయ వ్యవసాయ సహకార సంఘం వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా ఆయన జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సహకార సంఘం ద్వారా వచ్చే అన్ని రకాల రుణాలు, రాయితీలను రైతులు సద్విని యోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, న్యాయవాది శివకుమార్, సహకార సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

20న చింతచెట్ల వేలం

గుడిబండ : పంచాయతీ పరిధిలో ఉన్న చింత చెట్లకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజునాయక్, సర్పంచ్ కరుణాకర్ ఆధ్వర్యంలో 2025-26 ఏడాదికి గానూ బహిరంగ వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రెడ్డి ప్రకాష్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పంచాయతీకి రూ. 2వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

19న మండలమీట్

ప్రజాశక్తి - కొత్తచెరువు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల 19న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నటరాజు తెలిపారు. ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో మండలంలోని వివిధ అభివృద్ధి పనులపై చర్చించడం జరుగుతుందన్నారు. కావున మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఎంపిటీసీలు, సర్పంచులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - నల్లమాడ

నల్లమాడ పంచాయతీలోని గ్రామాల అభివృద్ధికి ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి దాదాసాహెబ్ కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమాడ పంచాయతీ స్వర్ణపంచాయతీగా ప్రకటించారన్నారు. ఇంటిపన్ను తదితర పన్నులు ఆన్‌లైన్‌లో చెల్లించాలని కోరారు. సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని గ్రామస్తులను పంచాయతీ కార్యదర్శి కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ దాదా సాహెబ్, హాస్పిటల్ డైరెక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, మైనార్టీ నాయకులు పటాన్ బాబావలి, అనిమేటర్ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

19న సంతాన సాఫల్య అవగాహన శిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని స్పందన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఈ నెల 19న ఉచిత సంతాన సాఫల్య అవగాహన శిబిరం నిర్వహిస్తున్నట్లు స్పందన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఈరలక్కప్పకు సన్మానం

ప్రజాశక్తి-గుడిబండ

మడకశిర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎస్ఎల్.ఈరలక్కప్పను సోమవారం ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు బిడి.నరసింహరాజు, నాయకులు మండలంలోని పలారం గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈరలక్కప్పకు పూలమాల వేసి శాలువా కప్పి సన్మానిం చారు. నరసింహరాజు మాట్లాడుతూ తనకు వైసిపి ఎస్సీ సెల్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా అవకాశం కల్పించిన పార్టీ అధినేత జగన్, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, ఈరలక్కప్పకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఈరన్న, నాయ కులు చిత్తన్న, గోవిందరాయప్ప, మంజునాథ్, నరసింహరాజు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయి నీటిమట్టంతో బుక్కపట్నం చెరువు..

నిండుకుండలా బుక్కపట్నం చెరువు

ప్రజాశక్తి - బుక్కపట్నం

ఉమ్మడి జిల్లాలోని అతి పెద్దదైన బుక్కపట్నం చెరువుకు పూర్తిస్థాయిలో నీరు రావడంతో నిండు కుండలా మారింది. 15 రోజులుగా హంద్రీనీవా కాలువ ద్వారా నీ మరువరు నీరు రావడంతో పాటు గత నెలలో కురిసిన వర్షాలకు పూర్తిస్థాయిలో నీరు చేరడంతో మరువ పారుతోంది. బుక్కపట్నం ఒకసారి నిండితే ప్రత్యక్షంగా పరోక్షంగా, దాదాపు నాలుగు వేల ఎకరాల్లో పంట సాగులోకి వస్తుంది. కాగా రైతుల పంట పొలాలకు వెళ్లే ప్రధాన కాలువలు పిచ్చి మొక్కలు కంపచెట్ల, పూడిక మట్టితో నిండిపోయాయి. కాలువలు తవ్వించి శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు రైతులు కోరుతున్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు బుక్కపట్నం చెరువు మరువ వద్ద జల హారతి కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు టిడిపి మండల కన్వీనర్ మలిరెడ్డి, టౌన్ కన్వీనర్ ఎర్ర కేశప్ప తెలిపారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - కొత్తచెరువు

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. పుట్టపర్తి మార్కెట్ యార్డులో మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ అధ్యక్షతన సోమవారం నిర్వహిం చిన సర్వసభ సమావేశానికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ యార్డు లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామ న్నారు. రైతులు ధాన్యాలను నిలువ ఉంచుకోవడానికి ఇక్కడ ఉన్న గోదాములను వినియోగించుకోవాల న్నారు. ఇక్కడ ప్రతివారం గొర్రెల సంత జరుగుతున్నందున మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమం లో రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్ర శేఖర్, మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు ప్రేమనాథరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సింధూర, రఘునాథరెడ్డి

జెవివి, యుటిఎఫ్ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షు లు కెఎస్.లక్ష్మణరావు సహకా రంతో జన విజ్ఞాన వేదిక, యుటి ఎఫ్ ప్రచురించిన ఎన్ఎం ఎంఎస్ పరీక్ష రాసే విద్యార్థుల కు ఉపయోగపడే మెంటల్ ఎబిలిటీ మెటీరియల్ పుస్తకాల ను సోమవారం పంపిణీ చేశారు. పట్టణంలోని శాంతినగర్ మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసే విద్యార్థులకు ఉపయోగపడే మెంటల్ ఎబిలిటీ మెటీరియల్ పుస్తకాలను ఉచితంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ నాయక్, ప్రధానోపాధ్యాయులు ఉమాపతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఈ పుస్తకాలను ఉచితంగా అందజేశా మన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పట్టణ శాఖ నాయకులు నాగిరెడ్డి, ప్రదీప్ కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష మెటీరియల్ అందజేస్తున్న జెవివి, యుటిఎఫ్ నాయకులు

కవుల గురించి విద్యార్థులకు వివరిస్తున్న అధికారి

గ్రంథాలయంలో కవి సమ్మేళనం

ప్రజాశక్తి-రొద్దం

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించినట్లు అధికారి హెచ్.నాగరాజు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఉపాధ్యాయులు రామాంజనేయులు హాజరయ్యారు. విద్యార్థులకు కవి అంటే ఎవరు, ఎర్రన, తిక్కన, పోతన, వాల్మీకి, తదితర కవులు, వారు రచించిన గ్రంథాలు, కవితల గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు వివరాలు పరిశీలించుకోండి

ప్రజాశక్తి-పరిగి

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంట వివరాల సామాజిక తనిఖీ – ఫిర్యాదుల స్వీకరణకై నిర్వహిస్తున్న గ్రామసభలో ప్రతి ఒక్క రైతు పాల్గొనాలని వ్యవసాయ అధికారిని బృందావని తెలియజేశారు. సోమవారం స్థానిక ఒకటవ సచివాలయంలో ఈ పంట నమోదు పత్రాలను ఉంచినట్లు ఆమె తెలిపారు. ప్రతి రైతు తమ పంట నమోదును పరిశీలించుకోవాలని ఏవైనా తప్పులు దొర్లినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అంతేకాకుండా అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రెండవ విడత నగదు జమ గురించి రైతుల వివరాలు తెలియజేసేందుకు మంగళవారం ఉదయం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రతి రైతు పాల్గొని సాగు చేసిన పంట నమోదును గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఎస్ ఎన్ గోవింద్ రెడ్డి, హేమలత ఉన్నారు.

రైతులకు ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని ఏడు సచివాలయాల పరిధిలో రైతులకు సోమవారం సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేపట్టారు. ఈసందర్భంగా ఎఒ సయ్యద్ షాదాబ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం 80 శాతం సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేస్తోందని చెప్పారు. సోమవారం నాటికి 101 మంది రైతులకు ఉలవలు పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రాజేష్, ఫైరోజ్, పూజిత, మనోహర్, కూటమి నాయకులు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

రైతులకు ఉలవలు పంపిణీ చేస్తున్న అధికారులు

వైసిపి కార్యాలయంలో వైఎస్ఆర్ విగ్రహం ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఇటీవల జరిగిన దాడిలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ధ్వంసం కావడంతోపాటు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటం ధ్వంసమయింది. ఈ నేపథ్యంలో సోమవారం లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, మనోజ్ జూలియట్ తదితరులు వైసిపి కార్యాలయంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ కార్యాలయం పై దాడి చేయడం దుర్మార్గమన్నారు. హిందూపురం చరిత్రలో ఎప్పుడూ పార్టీ కార్యాలయాలపై దాడులు జరగలేదని, ఇలాంటి సంఘటనలపై ప్రజా సంఘాలు, మేధావులు స్పందించాలని కోరారు. పోలీసు ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకొని హిందూపురంలో ప్రశాంతతను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి అంజన్ రెడ్డి, బాబూజీ నగర్ శ్రీరాములు, చైతన్య గంగిరెడ్డి, మోతుకపల్లి లక్ష్మీనారాయణ, వైయస్ఆర్‌సీపీ విద్యార్థి నాయకుడు బెన్నీ, మధు, శ్యాంబాబు, అనూక్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహం వద్ద నాయకులు

సత్యగీత పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురంలోని సప్తగిరి కళాశాలలో వడ్డి సుధాకర్ అధ్యక్షతన సత్య సాయి జయంతోత్సవం సోమవారం ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఈశ్వర్ రెడ్డి, సగర కార్పొరేషన్ డైరెక్టర్ మణిప్రియ హాజరై సత్య గీత కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, సమాజాభివృద్ధి కోసం బాబా సేవలు ఆదర్శనీయ మన్నారు. సాహిత్యంతో సామాజిక చైతన్యాన్ని తీసుకువచ్చేలా లేపాక్షి ఫౌండేషన్ కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగాకళాశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఫౌండేషన్ సత్యసాయి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, కమిటీ సభ్యులు గురు కాశీ విశ్వనాథ్, గంగాధర్, సప్తగిరి కళాశాల ఏఓ గంగిరెడ్డి, ఎంబిఎ ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి, కర్నాటక కవులు అమర్నాథ్, రాధామణి, రాజ్యలక్ష్మి, శ్రావణి, ప్రసూన పాల్గొన్నారు.

సత్యగీత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పెళ్లింట విషాదం..

వంటగ్యాస్ లీకై మంటలు.. ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని ఓ పెళ్లింట విషాదం నెలకొంది. ఇంట్లో గ్యాస్ లీకై మంటలు వ్యాపించడం తో ఏడుగురికి గాయాలపాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక రాయల్ సర్కిల్‌లో నివాసం ఉంటున్న వడ్డే రామాంజినేయులు ఇంట ఆదివారం పెళ్లి సంబరాలు జరిగాయి. అయితే సోమవారం సాయంత్రం తిరుగు పెళ్లి (రిషిప్షన్) ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈనేపథ్యంలో ఉదయం వంట గదిలో సిలిండర్ మార్చేందుకు మహిళ ప్రయత్నిస్తూ రెగ్యులేటర్ సక్రమంగా అమర్చకపోవడంతో గ్యాస్ లీకై పక్కనే దేవుడి గదిలో ఉన్న దీపాలకు మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమై అక్కడ ఉన్నవారు మంటలను ఆర్పి వేశారు. అయితే అప్పటికే పెళ్లికి వచ్చిన రామాంజి నేయులు బంధువులు రాజేశ్వరి, రాధ, ఉమాదేవి, చాముండి, దీక్షిత, ఆకాష్, సురేఖకు గాయ్యాల య్యాయి. గాయపడ్డ వారిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాధితులకు ఎమ్మెల్యే సోదరుడి పరామర్శ

గ్యాస్ సిలిండరు లీకై జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు గుమ్మ నూరు శ్రీనివాసులు సోమవారం పరామర్శిం చారు. సంఘటన వివరాలను అడిగి తెలుసు కున్నా రు. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న బాధితులు

వైద్యుడి మృతదేహం లభ్యం

ఆత్మకూరు : మండల పరిధిలోని హంద్రీనీవా కాలువలో ఆదివారం గల్లంతైన బెళుగుప్ప మెడికల్ ఆఫీసర్ కార్తీక్‌రెడ్డి (39) మృతదేహం సోమవారం సాయంత్ర లభ్యమైంది. పంపనూరు మెయిన్ రోడ్డు నుంచి గోరిదిండ్ల రోడ్డులో నాలుగు కిలోమీటర్ల దూరంలో మృతదేహం కనిపించినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హత్యకేసులో ముగ్గురు అరెస్టు

బెలుగుప్ప : భార్య హత్యకేసులో భర్తను అరెస్టు చేసినట్లు సిఐ మహానంది తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలో గత గురువారం సాయంత్రం అనుమానంతో బోయ శాంతిని భర్త ఆంజనేయులు వేటకొడవలితో నరికి నరికి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో సోమవారం సాయంత్రం గుండ్లపల్లి క్రాస్ వద్ద ఆంజనేయులుతోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి-రొద్దం

పాముకాటుకు గురై మహిళ మృతిచెందిన సంఘటన సోమవారం మండలంలోని నారానాగేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కురుబ చిట్టి(30) రోజూ తరహాలోనే సోమవారం రెండు ఆవులను మేతకు తీసుకెళ్లింది. ఆ సమయంలో పంట పొలంలో పాముకాటుకు గురై స్పృహ తప్పి పడిపోయింది. సమీపంలో ఆవులు మేపుతున్న కొందరు గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి చేరుకుని ఆమెను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే మండల టిడిపి సీనియర్ నాయకుడు మాధవనాయుడు ఆసుపత్రికి వెళ్లి మహిళ మృతదేహాన్ని సందర్శించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కురుబ చిట్టి

యువతి ఆత్మహత్య

గుత్తి : పట్టణంలోని పాత సిపిఐ కాలనీలో సోమవారం ప్రియా (22) యువతి యువతి ఆత్మహత్య చేసుకుంది. ఎఎస్ఐ నాగమణిక్యం తెలిపిన వివరాల మేరకు.. యాడికి మండలం కోనఉప్పలపాడుకు చెందిన నాగలక్ష్మి, పుల్లారావు దంపతుల కుమార్తె ప్రియాతో కలిసి కొన్నేళ్లుగా పట్టణంలోని పాత సిపిఐ కాలనీలో నివాసం ఉండేవారు. నాగలక్ష్మి ఆకుకూరలు వ్యాపారం చేసేది. ఈనేపథ్యంలో ప్రియా కొంతకాలంగా కడుపునొప్పి బాధపడుతూ ఉండేది. పలు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్న నయం కాకపోవటంతో బాధను భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఇంటి పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

IN THE COURT OF THE HON'BLE ADDL. JUNIOR CIVIL JUDGE PENUKONDA
O.S.No.32/2023
Between:
S.Asiya ...Plaintiff
AND
S.Allabakash and others ...Defendants
NOTICE TO THE DEFENDANT NO 8:
S.Suhail S/o S.Baba Fakroddin, aged about 22 years, Occ. Business, R/o D.No.2-1-209 Mukkidipeta, Hindupur, Sri Satya Sai District.
Please take notice that the above case is posted to 04-12-2025 at 10:30 a.m. In the above court. You are hereby called upon to appear before the above court on 04-12-2025 at 10:30 a.m. By personally (or) through an advocate, failing to appear which the above case will be decided exparte against you.
(By order of the court)
Sri.R.AZMATHULLA,
Advocate, Hindupur

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) PENUKONDA
E.P.6/2025 in O.S.No: 26/2014
Between:
M.Madhava Reddy ...Petitioner-DHr
AND
M.Nagabhushana Reddy ...Respondent-JDr
పై నెంబరు E.P లోని ప్రతివాదికి Order 21 Rule 64 & 66 నోటీసు
TO,
M.Nagabhushana Reddy S/o Mylavaram Chandrappa Indla Venkatampalli, Bussiness, H/o Talamarla, Kothacheruvu Mandalam.
పై నెంబరు E.P లోని అర్జీదారుడు నీ నుండి E.P మొత్తము రాబట్టు కొనుటకుగాను E.P షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలము వేయుటకుగాను పై నెంబరు E.P ని దాఖలు చేసినారు. సదరి విషయములై నీకు ఏమైనా అక్షేపణలువున్న ఎడల నీవు 25-11-2025వ తేదీనా ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై నీ వాదనను కోర్టువారికి తెలుపుకొనవలెయును. లేని ఎడల నీ పరోక్షమందు పై అర్జీని తీర్మానము చేయుదురని యిందుమూలకముగా నీకు తెలియచేయడమైనది.
(By order of the court)
శ్రీ.ఆర్.శ్రీకాంత్‌రెడ్డి,
అర్జీదారుపరం వకీలు, పెనుకొండ